"ఉత్తిష్టత!జాగ్రత!ప్రాప్యవరాన్నిబోధత"
కలియుగాబ్ది 5122
మాసపత్రిక
# హిందూ నగారా
మాసపత్రిక
సంపుటి : 28 ✿ సంచిక : 4 ✿ పేజీలు : 12 ✿ విడిప్రతి : రూ.5.00 ✿ శ్రీ శార్వరి నామసంవత్సరం : చైత్ర మాసం : 01-04-2020

## జాతి నిర్మాణంలలో భాగస్వాములవుదాం

ఫిబ్రవరి నెలలో రాష్ట్రంలో పలుచోట్ల ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో హిందూ ధార్మిక సమ్మేళనాలు జరిగాయి. ముఖ్యంగా పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, పెనుగొండ, పాలకొల్లు ప్రాంతాలలో ఘనంగా ఈ సమ్మేళనాలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో






తెనాలి శ్రీ విద్యా పీఠానికి చెందిన పూజ్యశ్రీ ప్రజ్ఞానంద సరస్వతి, రాజమండ్రికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మాతృశ్రీ గీతా వాణి, సత్యవాడలోని శివానంద ఆశ్రమం నిర్వాహకులు పూజ్యశ్రీ శివానంద సరస్వతి స్వామీజీ, భాగ్యనగర్ కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ఎన్. అనంతలక్ష్మి, పెనుగొండలోని శ్రీ వాసవి శాంతి ధామ్ నిర్వాహకులు పూజ్యశ్రీ కృష్ణానందపురి స్వామీజీ లు పాల్గొని ఆశీః ప్రసంగాలు చేశారు.ఇంకా పలువురు రాజకీయ ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్న ఈ కార్యక్రమాలలో ఆర్ ఎస్.ఎస్.ఆంధ్ర ప్రదేశ్ ప్రాంత ధర్మజాగరణ ప్రముఖ్ శ్రీ తిరుపతయ్య ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. *7వ పేజీ చూడండి...*

## ఆపత్కాలంలో అండగా నిలుస్తున్న ఆర్ఎస్ఎస్



జనసంక్షేమ సమితి, సేవాభారతి మరియు రాష్ట్రీయ స్వయంసేవక సంఘు కార్యకర్తలు ప్రక ృతి వైపరిత్యాలు సంభవించినపుడు బాధితులకు సహాయ కార్యక్రమాలు చేయడంలో ముందుండి పనిచేయడం అందరికీ తెలిసిందే.

కరోనా వైరస్ మహమ్మారి (కోవిడ్-19)ను ఎదుర్కొనేందుకు దేశమంతా లాక్ డౌన్ ప్రకటించడం తప్పనిసరి అయినది. దీనివలన ఎందరో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మన ప్రధాని 24 మార్చి 2020 రాత్రి లాక్ డౌన్ ప్రకటించగానే 25,26 తేదీలలో పనులు లేక, ప్రయాణాలు చేయలేక పస్తులుండవలసిన పరిస్థితి *6వ పేజీ చూడండి...*

## గురుద్వారాపై ఉగ్రదాడిలో కేరళ జీహాదీ హస్తం



కాబూల్‌లోని సిక్కు గురుద్వారాపై జరిగిన ఉగ్రదాడి వెనుక కేరళకు చెందిన ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాది అబూ ఖలీద్ అల్-హిందీ ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ దాడిలో 25 మందికి పైగా మ ృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. ఆఫ్ఘనిస్తాన్లోని ఆన్‌లైన్ వార్తా సంస్థ ఖామా ప్రెస్ దీనిని ధృవీకరిస్తోంది. ఇస్లామిక్ స్టేట్ యొక్క శాఖ అయిన ఐసిస్ ఖోరాసన్ యొక్క అధికారిక వార్తా సంస్థ "ది అమాక్ న్యూస్" నుండిఆ వార్తా సంస్థ ఈ సమాచారాన్ని తీసుకుంది.ఐసిస్ కాబూల్ నగరంలోని సిక్కు ఆలయంలోకి చొరబడిన ఆత్మాహుతి బాంబర్ ఫోటోను విడుదల చేసింది.అతనిని కేరళలోని వలపట్టణం ఐఎస్ క్యాంప్ కేసులో నిందితుడైన అబూ ఖలీద్ అల్-హిందీ అకా అబ్దుల్ ఖయూమ్ గా భావిస్తున్నారు. ఐఎస్ లింకుల ఆరోపణలపై కన్నూర్ జిల్లాలోని వలపట్టణం నుంచి అబూ ఖలీద్‌తో సహా ఐదుగురిపై ఎన్ఐఏ 2017 లో కేసు నమోదు చేసింది.సిక్కు సమాజమే తమ లక్ష్యమని పేర్కొంటూ ఉగ్రవాద సంస్థ క్లుప్తమైన ప్రకటన ఒకటి విడుదల చేసింది

# భారతి ప్రియ సుతుడు భీంరావు అంబేడ్కర్

ప్రేరణ



అత్యుత్తమమైన భారతరత్న బిరుదాంకితుడు. భారతదేశ రాజ్యాంగ నిర్మాత. నిమ్న కులస్థుల ఉద్ధరణకు, అస్పృశ్యతా నిర్మూలనకు కృషిచేసి సామాజిక న్యాయం కోసం కొనఊపిరి ఉన్నంతవరకు పోరాడిన మహానుభావుడు. మహారాష్ట్రలోని కొంకణ ప్రాంతంలో ఉన్న రత్నగిరి జిల్లాలోని అంబవాడ గ్రామంలో 1891 ఏప్రిల్ 4వ తేదీన 14వ సంతానంగా జన్మించాడు. తండ్రి రాంజీ సక్పాల్, తల్లి భీమాబాయి.

అస్పృశ్యత కారణంగా బాలునిగా ఉన్నప్పటినుండి అనేక చేదు అనుభవాలను పొందాడు. అయినా తనను ఆదరించిన అంబేద్కర్, కృష్ణాజీ అర్జున కేలూస్కర్లనే బ్రాహ్మణ ఉపాధ్యాయులచే ప్రభావితుడైనాడు. అంబేద్కర్ మరాఠీ, హిందీ, ఆంగ్లం, పర్షియన్ మొదలు భాషలలో ప్రావీణ్యం గలవాడు, రోజుకు 18 గంటల పాటు నెలల తరబడి అవిశ్రాంతంగా పరిశోధన చేస్తూ తన జ్ఞాన యజ్ఞాన్ని సాగించి రాజనీతి శాస్త్రం, సామాజిక శాస్త్రము, ఆర్థిక శాస్త్రములలో ప్రావీణ్యం సంపాదించారు. "భారతదేశ జాతీయాదాయ- చారిత్రక విశ్లేషణాత్మక అధ్యయనం" అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి కొలంబియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టాను సంపాదించాడు. లండన్ నుండి సైన్స్ లో డాక్టరేట్ పొందాడు.

గ్రేస్ ఇన్ ఫర్ లా లో చేరి న్యాయశాస్త్ర అధ్యయనంచేసి బారిష్టర్ అయ్యాడు. అనేకాంశాలపై వ్యాసాలు వ్రాసి ప్రపంచపు గుర్తింపు పొందాడు. దళితజనోద్ధరణకు 1920లో మూక నాయక్ (మూగ ప్రజల నాయకుడు) అనే పక్షపత్రికను వెనుక ఉండి నడిపించాడు. 1927లో బహిష్కృత భారత్ అనే పక్షపత్రిక ప్రారంభించాడు. సమానత్వం ప్రాతిపదికపై సమాజ పునర్నిర్మాణం కోసం బహిష్కృత హితకారిణీ సంస్థనేర్పాటుచేసి నిర్వాహక సమితి అధ్యక్షుడైనాడు. మహద్ పోరాటంచేసి దళితనాయకునిగా స్థిరమైన స్థానాన్ని సంపాదించుకొన్నాడు

1931లో రెండవ రౌండ్ టేబుల్ సమావేశం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనల్ అవార్డు ద్వారా హరిజనులకు ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించింది. కాని అంబేద్కర్ గాంధీజీతో పూనా ఒడంబడిక చేసికొని ప్రత్యేక నియోజకవర్గాలకు బదులుగా కాంగ్రెసు గిరిజన అభ్యర్థులను నిలిపేటట్లుగా అంగీకరింపజేశాడు. ఆ విధంగా కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పరచటం సాధ్యం చేశాడు. ముస్లిం, క్రైస్తవ మతాధికారులు అంబేద్కర్ ను తమవైపు ఆకర్షించడానికి పరిపరి విధాల ప్రయత్నించారు. జాతీయాభిమాని, హిందూధర్మాభిమానియైన అంబేద్కర్ బాహాటంగానే నిర్భయంగా వారిని తిరస్కరించాడు. "కులతత్వం పోవాలిగాని మా ధర్మం మాకుండాలి" అనే భావాన్ని వ్యక్తం చేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక న్యాయశాఖ మంత్రియైనాడు. రాజ్యాంగ రచన చేసే కమిటీకి ఛైర్మన్ అయ్యాడు. తన మేధాసంపత్తితో విద్యాప్రతిభతో ఉన్నత శిఖరాలకు ఎదిగి భారత రాజ్యాంగానికి రూపురేఖలు ఇచ్చి అభినవ మనువుగా కీర్తిగాంచాడు. అస్పృశ్యతను పాటించేవారికి శిక్ష విధించే బిల్లును 1953లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింప జేశాడు. శాంతికోసం, న్యాయంకోసం తహతహలాడుతూ ఆరాటం చెందుతున్న తోటి హరిజనులు కమ్యూనిజం కోరలకు చిక్కకుండా రక్షింపబడటంకోసం లక్షలాది మందితో కలిసి డా॥ అంబేద్కర్ 1956 అక్టోబర్ 14న బౌద్ధమతాన్ని స్వీకరించాడు. అస్పృశ్యత అనే సమస్యను పరిష్కరించడానికి భారతీయ సంస్కృతీ చరిత్రలకు హాని చేయని మార్గాన్ని అనుసరించడమే ఆయన వైఖరికి ప్రాతిపదిక. 1956 డిసెంబర్ 6న ఆయన అంతిమశ్వాస విడిచారు.

సాంఘిక దురాచారాలకు లొంగక వాటిని ఎదిరిస్తూ జీవితమంతా ఏటికి ఎదురీదాడు. దళితులు, పీడితులు, ఉపేక్షితులు, అంతా సగర్వంగా తలెత్తుకు తిరగాలి. అంతరాలు అపోహలు అంతమై సమతామమతలు వెల్లివిరియాలి. అదే ఆయన ఆలోచన, ఆకాంక్ష, ఆవేదన, జీవనలక్ష్యం కూడా. అంబేద్కర్ త్యాగమయ, కర్మమయ, తపోమయ, జీవనుడు. ఆయన వాణి, బాణి, నాయకత్వ లక్షణం, సంఘటనా దక్షత, అందరినీ కలుపుకుంటూ ముందుకు పోవడంలో చూపిన ప్రతిభ విలక్షణమైనవి, విశేషమైనవి కూడా. నమ్మిన సిద్ధాంతానికి ఆత్మవిశ్వాసంతో సుదీర్ఘపోరాటం సాగించిన యోధుడు. ఆయన పడుతున్న పాట్లు, మనసులోని వేదన ఆయన రచనలలో, ప్రసంగాలలో వ్యక్తమయ్యేవి. ఆదర్శవాదం, దేశభవిష్యత్తుకు సంబంధించిన దూరదృష్టి ఆయన జీవన అంతస్సూత్రాలు. బుద్ధుని వలె ఈయన కూడా భారతీయ జనతకు విద్య, పోరాటం, సంఘటన, పునర్నిర్మాణం, ఐక్యత అనే అయిదు సూత్రాలను బోధించాడు. అందుకే ప్రతి ఒక్కరు ఆయనను ఇప్పటికీ "బాబాసాహెబ్" అని ప్రేమాభిమానాలతో పిలుచుకుంటారు.

# శ్రీరామం- సదా ఆదర్శం

సంపాదకుని నగారా

**రచన : వై.రాఘవులు,**

విశ్వహిందూపరిషత్ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి

తల్లిదండ్రుల మాటను తు చ తప్పక పాటించడం, సోదరులను అత్యంత ఆదరంగా చూడటం, తన భార్యను అత్యంత ప్రేమగా చూసుకోవడం, తన పాలనలో ప్రజలను తన కన్నబిడ్డల్లా చూడటం, వారికి ఎటువంటి కష్టాలులేకుండా పాలించడం, దుష్టులను శిక్షించడానికి, ధర్మాన్ని రక్షించడానికి ఎంత దూరమైనా వెళ్ళటం వంటి సద్గుణాలు మూర్తీభవించిన వ్యక్తి, స్త్రీవ్యామోహం, ధనవ్యామోహం, పదవీ వ్యామోహం వంటి దుర్గుణాలు లేని వ్యక్తి కనిపించడం చాలా అరుదు. కానీ విలువలకు పట్టంకట్టే మన సనాతన భారతదేశంలో ఈ అన్ని గుణాలు కలిగిన వ్యక్తులు అనేకులు ఉన్నారు. కానీ వారందరికీ ఆదర్శం నాటి శ్రీరాముడు.

ఒకానొక సందర్భంలో వాల్మీకి మహర్షి నారదమహర్షిని 'ఈ భూమిలో ఈక్రింది 16 లక్షణాలు లేక సద్గుణాలు కల్గిన ఆదర్శ పురుషుడు ఎవరైనా ఉన్నారా?' అని అడిగారు. ఆ 16 సద్గుణాలు ఇవి :

1.గుణవంతుడు, 2.వీర్యవంతుడు, 3.ధర్మజ్ఞుడు, 4.కృతజ్ఞుడు, 5.సత్యాన్ని పలికేవాడు, పాటించేవాడు, 6.దృఢవ్రతుడు, 7.చరిత్రను లిఖింపగల యోధుడు, 8.సర్వప్రాణుల హితం కోరుకునేవాడు, 9.విద్వాంసుడు, 10.సమర్థుడు,11. ఏక ప్రియదర్శిగా అంటే వాస్తవాన్ని గ్రహించేవాడు, 12.ఆత్మను దర్శించేవాడు, 13.జితక్రోధ 14.ద్యుతిమాన్ 15. అసూయ లేనివాడు,16.జాతి రోషస్య సంయాగే అంటే యుద్ధరంగంలో మూర్తీభవించిన ఆగ్రహం కలవాడు.

వాల్మీకి అడిగిన ప్రశ్నకు సమాధానంగా నారదుడు 'ఉన్నాడు. అంతేకాదు మరో 67 గుణాలున్న మహానుభావుడు కూడా ఉన్నాడు. ఆయనే శ్రీరామచంద్రుడు' అని చెప్పాడు.

**రామో విగ్రహవాన్ ధర్మః**

అంటే 'ధర్మం విగ్రహ రూపంలో అంటే రాముని రూపంలో ఉంది' అని అర్థం. నాటి త్రేతాయుగంలో ఆదర్శమానవ జీవితాన్ని గడిపి సామాన్య వ్యక్తిగా అసామాన్య ప్రజ్ఞ చూపించిన మహావ్యక్తి శ్రీరాముడు.

అంత పరాక్రమవంతుడు, ధర్మ పరాయణుడు, తన రాజ్యంలో ధర్మాన్ని నాలుగు పాదాల నిలబెట్టిన శ్రీరాముడు 'రామం దశరథాత్మజం' అంటే 'నేను కేవలం దశరథ మహారాజు కుమారుణ్ణి' అని చెప్పుకుంటాడు.

అందుకే **'స్నేహం దయాంచ సౌఖ్యంచ యదిరాజో నకీమపి**
**ఆరాధనాయ లోకస్య మంచతే నాస్తిమేవ్యధాః'**

అంటే మానవ జన్మలోని ముఖ్యధర్మం లోకకల్యాణం. ధర్మాచరణలో స్నేహం, దయ, సుఖం కోరుకోరాదు. ధర్మాచరణ కోసం తాను అత్యంత ప్రేమించే తన భార్య జానకిని విడువడంలో సైతం కించిత్వ్యధ చెందను అంటాడు శ్రీరాముడు. ధర్మాచరణలో అటువంటి గొప్ప సంకల్పం గలవాడు. అందుకే ఆయనను రామో విగ్రహవాన్ ధర్మః అన్నారు పండితులు. అంటే రాముడు విగ్రహ రూపంలో ఉన్న ధర్మం వంటివాడు. అంటే ధర్మానికి రూపం అని అర్థం.

**'ధర్మం' రాజ్యమేలిన యుగం**

అది త్రేతాయుగం. ధర్మాచరణలో స్వయంగా శ్రీరాముడు తాను ఆదర్శంగా ఉండి, ఆ ఆదర్శాన్ని తన ప్రజలు, సోదరులు, తల్లిదండ్రులు, మిత్రులు, శత్రువులు, గురువులు కూడా ఆచరించేలా స్ఫూర్తిని కలిగించాడు. అటువంటి ఆదర్శవంతమైనది శ్రీరాముని చరిత్ర.

**'వజ్రాదపి' కఠోరాణి మృదూని' సుమా.."**

ధర్మాచరణలో వజ్రం వంటి కఠినత్వం, ప్రేమించడంలో పువ్వువంటి సుకుమారత్వం ప్రదర్శించాడు శ్రీరాముడు.

మన రాజులు తాము ప్రతిజ్ఞ చేసేటప్పుడు శాస్త్రప్రకారం 'అదండ్యోస్మి అదండ్యోస్మి' అన్నప్పుడు 'ధర్మదండోస్మి ధర్మదండోస్మి' అంటూ ధర్మధర్మదండంతో కిరీటంపై తాకిస్తారు ఋషి లేక పురోహితుడు.

రాముని హయాంలో సాక్షాత్తూ ధర్మమే రాజ్యమేలుతోందా? అనుకునే స్థాయిలో రాజ్యపాలన ఉండేది. అటువంటి ఆదర్శ రాజ్యం రామరాజ్యం.

**ధర్మం రాజ్యమేలడమంటే ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం.**

రామరాజ్యంలో ధర్మం నాలుగు పాదాలా నడుస్తూ ఉంటుంది. ఏది జరిగినా ధర్మం ప్రకారం జరుగుతుంది. ఎవరికీ అన్యాయం జరుగదు. ప్రజలందరిలో ఒకరి పట్ల ఒకరికి పరస్పర విశ్వాసం, ప్రేమ ఉంటుంది. భర్తపట్ల భార్య; అన్నపట్ల సోదరులు, ప్రజలపట్ల రాజుకు, రాజుపట్ల ప్రజలకు, ప్రజలపట్ల గురువులకు నిష్కల్మషమైన ప్రేమ, ఆదరం ఉంటుంది. ఆ రాజ్యంలో ఎవరి ధర్మం వాళ్ళు పాలిస్తూ ఆదర్శంగా నిలిచారు. రాజ్యంలో అధర్మానికి తావేలేదు.

**దుష్టశిక్షణ - శిష్టరక్షణ**

అటువంటి ఆదర్శరాజ్యంలో ఆ చక్కని వ్యవస్థను నాశనం చేయడానికి రాక్షస మూక విజృంభించింది. రావణాసురుని

మాఫియాలైన వాలి, తాటకి, కరదూషణులు వంటి రాక్షసులు తమ పరివారంతో ఊళ్ళపై పడి విధ్వంసం సృష్టించేవారు. మేఘనాధుడు, కుంభకర్ణుడు, మారీచుడు వంటి వాళ్ళు విజృంభించి ఋషిమునుల ఆశ్రమాలపై పడి వారి యజ్ఞయాగాదులు విధ్వంసం చేసేవాళ్ళు. స్త్రీలను బలాత్కరించడం, ఋషులను, మునీశ్వరులను చంపి మాంసం తిని ఆ ఎముకలను కుప్పగా పోయడం వంటి దుర్మార్గపు పనులకు పాల్పడేవారు.

ఈ రాక్షసుల దుష్ట చర్యలను చూసిన శ్రీరాముడు 'నిశిచర హీనకరూంగామహి' అని శపథం చేసి యాగరక్షణకు సంకల్పించాడు. ఋషులకు మునులకు రక్షకుడిగా ఉండి, వారిలో విశ్వాసం కల్గించాడు. వన వాసులకు గిరివాసులకు భరోసా నిచ్చాడు. తన శౌర్యపరాక్రమాలతో జానకిని వివాహమాడి, పెద్దరాజులను ఐక్యపరిచాడు. శివధనస్సును విరిచి అనేక మంది రాజులలో ఆత్మ విశ్వాసాన్ని నింపాడు.

తన వనవాస సమయంలో అధర్మపరులైన అనేకమంది రాక్షసులను నిర్మూలించాడు. ఇన్ని చేసినప్పటికీ ధర్మస్థాపన పూర్తికాలేదు. సాక్షాత్తూ తనభార్య సీత అపహరణకు గురైంది. అపహరించిన వాడు అత్యంత పరాక్రమవంతుడు, అనంతమైన శక్తిసామర్థ్యాలున్న రావణాసురుడు. సంపూర్ణ ధర్మరక్షణ కోసం రావణుడ్ని కూడా సంహరించాలనే లక్ష్యం పెట్టుకోక తప్పలేదు శ్రీరాముడికి. ఆక్ష్యం సాధించడం కోసం తగిన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు. వానరుల్ని ఏకం చేశాడు. అందరి సహకారంతో లక్ష్యం సాధించాడు. రావణుడిని సంహరించాడు. ధర్మస్థాపన చేశాడు. ధర్మం నిలబెట్టడంలో, ఆచరించడంలోనూ ఉన్న ఆనందానుభూతిని మానవాళికి రుచి చూపించాడు.

**మానవధర్మం – లోకకళ్యాణం**

మానవజన్మ 'శరీరం కొరకు జీవించడం కాదు, సమాజకళ్యాణం కోసం జీవించాలి, అలాగే ఈ శరీరం ధర్మకార్య సాధనకు ఉపయోగపడే ఒక సాధనం. దానిని అలాగే చూడాలి' అనిచెప్పి ఆచరించి చూపాడు.

శ్రీరాముడు తన సంకల్పానికి పితృవాక్య పరిపాలన కూడా తోడై అంతఃపురం వదలి అరణ్యంలో ప్రవేశించాడు. నారబట్టలు కట్టుకున్నాడు. రాజకుమారుడు అయిఉండీ పర్ణకుటీరంలో గడిపాడు.

రాజాంతఃపురంలో రోజూ పంచభక్ష్యపరమాన్నాలు తినేవాడు అడవిలో ఆకులు, పండ్లు తిని ఉండడం అలవాటు చేసుకున్నాడు. రాజభవనంలో పట్టుపరుపులపై పవళించేవాడు అడవిలో నేలపై పడుకున్నాడు.

బంగారు కిరీటం ధరించిన వాడు తల వెంట్రుకలే జటాజూటంగా (కిరీటంగా) మలచుకున్నాడు. అతి సామాన్యుడిగా జీవితం గడిపాడు. ధర్మస్థాపన లక్ష్యం సాధించాడు. ఏదైనా లక్ష్యం సాధించాలంటే నిరాడంబర జీవితం అవసరం అని సందేశం ఇచ్చాడు.

తన లక్ష్యసాధన కోసం తనకు ఉపయోగపడగల అనేక మందిని కలిశాడు. వాళ్లందరితో సత్సంబంధాలు నెరపాడు. ఋషిమునుల ఆశీర్వాదం పొందాడు.

అగస్త్యమహర్షిని సేవించి ఆదిత్యహృదయం మహామంత్రాన్ని పొందాడు. ఇది రావణుని శక్తిని నిర్వీర్యం చేయటానికి ఉపయోగపడింది. భరద్వాజుణ్ణి సేవించి తపోమయ అస్త్రశస్త్రాలు సంపాదించాడు. సుగ్రీవునితో స్నేహంచేసి లక్షల సంఖ్యలో శక్తివంతమైన వానర సేనను సమకూర్చుకున్నాడు. నీలుడు, నలుడి సహాయంతో సేతు నిర్మాణం చేసి, తన ససైన్యంతో లంక చేరాడు. అక్కడ యుద్ధంలో విజయం సాధించాడు.

**ధర్మం – ఆచరణ – ఆదర్శం**

రావణ సంహారం అనంతరం శ్రీరాముడు రావణుని తమ్ముడు, సద్గుణ సంపన్నుడైన విభీషణునికి పట్టాభిషేకం చేశాడు. 'మరణాంతాని వైరాణి' అంటే 'మరణంతో శతృత్వం సమాప్తమైంది' అనిచెప్పి రావణుని మృతదేహానికి జరగవలసిన అన్ని కర్మలను అతని తమ్ముడైన విభీషణునితో చేయించాడు.

వాలిని చంపి కిష్కింధ గెలిచినా, రావణుని చంపి లంకను గెలిచినా అక్కడి వారసులకే రాజ్యాన్ని అప్పగించి ధర్మాచరణలో వారికి ఆదర్శంగా నిలిచాడు శ్రీరాముడు.

తనను అరణ్యానికి పంపిన కైకేయినిగాని, మంథరనుగాని నిందించలేదు సరికదా! వాళ్ళను జాగ్రత్తగా చూసుకొమ్మని సోదరులైన భరత శతృఘ్నులను ఆదేశించాడు. భరతునికి రాజనీతి బోధించాడు.

'అయోధ్య అయినా, అరణ్యమైనా మానవ జీవితంలో ఆచరించవలసిన ధర్మాలు సమానమే' అనిచెప్పాడు. అందుకే అడవిలో శబరిని అనుగ్రహించాడు, గుహుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు, జటాయువుకు అంతిమ సంస్కారాలు నిర్వహించాడు. వానరుల చంచల బుద్ధికి అడ్డుకట్టవేసి సమాజ కల్యాణానికి ఉపయోగించేలా మలచాడు. వీరుడు, సద్గుణ సంపన్నుడైన హనుమని అడుగడుగునా ప్రేమించాడు. ప్రేమ మానవునికి లభించిన గొప్పవరం అని, అది ఎంతో విశాలమైందని నిరూపించాడు.

**అనుశాసనం – అందరూ సమానం**

శ్రీరాముడు అనుశాసనం విషయంలో ఎప్పుడూ రాజీపడలేదు. చట్టం విషయంలో అందరూ సమానం అని చెప్పి, ఆచరించి చూపాడు. అనుశాసనం అంటే తను చేసిన శాసనాన్ని తన విషయంలో సైతం పాటించడం. అది లక్ష్మణుడి విషయంలో

ఋజువైంది. యుద్ధసమయంలో మూర్ఛపోయిన లక్ష్మణునిచూసి 'ఈప్రపంచంలో అందరికీ సోదరుడు లభించడు. అందులోనూ తన కష్టాలను పంచుకునే లక్ష్మణునివంటి సోదరుడు తనకు లభించడం తనఅదృష్టం. అటువంటి నాసోదరునికి ఇంతటి కష్టం రావడం నేను తట్టుకోలేక పోతున్నాను' అంటూ ఎంతో దుఃఖించాడు శ్రీరాముడు. లక్ష్మణుని పట్ల అంతటి ప్రేమగల శ్రీరాముడు తన పట్టాభిషేకం తరువాత జరిగిన ఒక అరుదైన సంఘటనలో లక్ష్మణునికి సైతం మరణదండన విధించడానికి ఏమాత్రం వెనుకాడలేదు. శ్రీరాముని పట్టాభిషేకం తరువాత అనేక సంవత్సరాలకు అంటే త్రేతాయుగాంతంలో ఒకసారి కలిపురుషుడు శ్రీరాముని కలిశాడు. ఏకాంతంగా మాట్లాడాలని కోరతాడు. ఆమోదించిన శ్రీరాముడు కలితో ఏకాంతంగా మాట్లాడుతున్న ఆగదిలోకి ఎవరినీ రానీయరాదని చెప్పి, ఆపని లక్ష్మణునికి అప్పగించాడు. ఒకవేళ ఆ ఆజ్ఞను ఉల్లంఘిస్తే.. అంటే ఎవరినైనా లోనికి రానిస్తే మరణశిక్ష ఉంటుందని లక్ష్మణునికి హెచ్చరించాడు. అయితే అదే సమయంలో దూర్వాసమహాముని వచ్చాడు. తాను శ్రీరాముని వెంటనే కలుసుకోవాలని లక్ష్మణుని ఒత్తిడి చేశాడు. అడ్డగించిన లక్ష్మణునితో దూర్వాసుడు 'తనను అడ్డగిస్తే ఇక్ష్వాకువంశం నాశనమయ్యేలా శపిస్తానంటూ ఆగ్రహించాడు. చేసేదిలేక లక్ష్మణుడు దూర్వాసుని రామదర్శనానికి అనుమతించాడు. అంతే ఆజ్ఞ ఉల్లంఘించినందున శ్రీరాముడు లక్ష్మణునికి మరణదండన విధించాడు. సరయూనదిలో లక్ష్మణుడు ప్రాణత్యాగం చేశాడు. ఆతర్వాత కొన్నాళ్ళకే శ్రీరాముడు సైతం పుణ్యలోకాలకు వెళ్ళిపోయాడు.

**వ్యామోహం - కళంకం**

కాంత, కీర్తి, కనకం.. అంటే స్త్రీవ్యామోహం, పదవీ వ్యామోహం, ధనవ్యామోహం. ఈ మూడూ మానవ జీవితానికి, మానవ ధర్మానికి కళంకం తెస్తాయని, వాటికి దూరంగా ఉండాలనిచెప్పి, ఆచరించి చూపాడు.

బంగారుమయమైన లంక తన చేతికి దొరికినా దానిని తృణప్రాయంగా వదిలివేశాడు.

**'అపిస్వర్ణమయీ లంకా నమే లక్ష్మణరోచతే**
**జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసీ'**

అని లక్ష్మణునితో చెప్పి ధనవ్యామోహం నుంచి దూరంగా ఎలా ఉండాలో చెప్పాడు.

తన వనవాస సమయంలో 13 సంవత్సరాల పాటు తన భార్య జానకి తనవెంట ఉన్నప్పటికీ ముని వృత్తినే అవలంబించాడు. శూర్పణఖ అతి సుందర రూపంతో వచ్చినా లొంగకుండా ఇంద్రియ నిగ్రహాన్ని చూపించి స్త్రీ వ్యామోహానికి దూరంగా ఎలా ఉండాలో చెప్పాడు. అయోధ్యను భరతునికి, కిష్కింధను సుగ్రీవునికి, లంకను విభీషణునికి అప్పగించి పదవీ వ్యామోహానికి దూరంగా ఉన్నాడు.

శ్రీరాముని ఈసద్గుణాలు నాటికి నేటికి మానవ సమాజానికి మార్గదర్శనం చేస్తూనే ఉన్నాయి.

**శ్రీరామనవమి సందేశం**

నాయకులను తయారు చేసేవాడే నిజమైన నాయకుడు. అనుచరులను తయారు చేసేవాడు వ్యాపారి మాత్రమే అవుతాడు. నాయకుడు కాదు.

**శరీరస్య గుణానాంచ, దూరమత్యంత మంతరం**
**శరీరం క్షణవిధ్వంసి, కల్పాంతస్థాయి నోగుణాః**

శరీరానికి, గుణానికి చాలా భేదమున్నది. శరీరం ఏక్షణంలోనైనా పతనమౌతుంది. (తేలుకుడితే, దోమకుడితే, అత్యంత సూక్ష్మక్రిమి దాడిచేస్తే నశించేది శరీరం). కాని సృష్టి చివరి వరకు నిలిచి ఉండేది వ్యక్తిగుణం మాత్రమే.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, వివేకానందుల శరీరాలు నేడు లేవు. కాని వారి గుణాలు శాశ్వతం అయ్యాయి. అందుకే శరీరం కోసం జీవించడం కాదు. లోకకళ్యాణం కోసం ఈ జీవితాన్ని అర్పించాలి. ఈ శరీరాన్ని ఉపయోగించి లోకకల్యాణ కారకమైన సద్గుణాలను సంపాదించుకోవాలి. మనం విగ్రహారాధకులం మాత్రమే కాదు, గుణారాధకులం. ఆ మహాపురుషుల విగ్రహాలు పెట్టుకున్న మనం వారి గుణాలనూ స్మరించాలి. అటువంటి ఆదర్శ జీవితం గడపాలని శ్రీరామనవమి మనకు గుర్తు చేస్తున్నది.

---

## కలం నగారా

### విధి చేసిన హెచ్చరిక

ఒక్కసారిగా...
అందరికీ అనురాగాలు గుర్తుకొచ్చాయి ఆత్మీయతలు
తన్నుకొచ్చాయి
అనుబంధాలు వొచ్చి ఒడిలో వాలాయి
మమతా మమకారాలు మాధవీలతల్లై పెనవేసుకున్నాయి
అలనాటి ఆచార వ్యవహారాలు ఆరోగ్య రహస్యాలు
మంజుల జీవనరాగాలు, ప్రశాంత జీవన మాధుర్యాలు
హఠాత్తుగా మన మధ్యకి నడిచి వచ్చాయి..
మనం మరిచిపోయిన మానవ సంబంధాలు ఎన్నో..
మనసు ముంగిట కుప్ప పోసింది కరోనా
మానవ జీవిత విలువలు - మనం ఇలపైకి వచ్చిన
కారణాలు
ఎదుట ఉన్న మరణ మృదంగ నాదాలు
నింపాదిగా వల్లె వేసింది కరోనా
కరోనా ......
ధరణి పైకి నడిచి వచ్చిన దైవ దూతిక
ధర్మం తప్పిన జగతికి విధి చేసిన హెచ్చరిక....

**- బాలకృష్ణారెడ్డి కొరిశెపాటి, ఒంగోలు.**

*1వ పేజీ తరువాయి*

# ఆపత్కాలంలో

ఎందరికో ఏర్పడింది.

ప్రభుత్వ పాలనా యంత్రాంగం మరియు పోలీసు వారి సూచనలు, అనుమతులు పొంది ప్రపంచ ఆరోగ్య సంస్థ జాగ్రత్తలు పాటిస్తూ రాష్ట్రీయ స్వయంసేవక సంఘం స్వయంసేవకులు ఇటువంటి బాధితుల సహాయార్థం హుటాహుటిన రంగంలోకి దిగి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు.

**అందిన సమాచారం ప్రకారం మార్చి 25, 26వ తేదీలలో లాక్ డౌన్ బాధితుల సేవలు :**

* గూడూరు మున్సిపల్ అధికారుల సూచన మేరకు ముఖ్యమైన సేవలందించిన సిబ్బందికి మాస్కులు వితరణ చేసారు. రోజువారీ కూలీలు మరియు నిరాశ్రితులకు రోజుకు 200 మందికి ఆహారం సరఫరా చేస్తున్నారు.

* మార్కాపురంలో ఒడిస్సా నుండి వచ్చి బి.ఇ.డి. చదువుతున్న 40 మంది విద్యార్థులకు వసతి, భోజనం, తిరుగు ప్రయాణానికి పోలీసువారి ద్వారా ఏర్పాట్లకు సహాయం అందించారు.

* ప్రకాశం జిల్లా గుడ్లూరులో 30 యానాదుల కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లు అందించారు.

* తెనాలిలో ప్రయాణాల మధ్య ఇక్కట్లపాలైన ప్రయాణీకులకు 100 మందికి భోజన వితరణ చేసారు. పోలీసు వారికి తేనీరు అందజేశారు.

* కడప లో 50 మంది నిరాశ్రితులకు ఆహారమందించారు.

* గాజువాకలో రాత్రి గస్తీ చేసే పోలీసు, సెక్యూరిటీ సిబ్బందికి తేనీటి ఏర్పాట్లు చేస్తున్నారు.

* విశాఖ జిల్లా అరిలోవకు వచ్చి చిక్కుకుపోయిన బీహారీలకు వసతి, భోజన ఏర్పాటు చేశారు.

* విజయవాడ, సింగ్ నగర్, ఉడా కాలనీ లోని వృద్ధులు మాత్రమే ఉన్న 30 కుటుంబాలకు వారం సరిపడా కూరగాయలు అందించారు.



మార్కాపురంలో



ప్రకాశం జిల్లా గుడ్లూరులో



తెనాలిలో



కడపలో



గాజువాకలో



రాజమండ్రిలో



తూ.గో.జిల్లా చినకొత్తలంకలో



నెల్లూరులో



నంద్యాలలో

**7వ పేజీ చూడండి..**

1వ పేజీ తరువాయి

## ఆపత్కాలంలో



పార్వతీపురంలో



ఏలూరులో



నంద్యాలలో

* రాజమండ్రి నగరంలో ఆరెస్సెస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి కరోనా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఉచితంగా మాస్కులను పంపిణీ చేశారు.

* సేవా భారతి, మచిలీపట్నం వారు పోలీసు డ్యూటీ చేస్తున్న సిబ్బందికి, మీడియా మిత్రులకు వాష్ బుల్ మాస్క్ లు, చేతి గ్లౌజులు జిల్లా పోలీసు SP గారి ఆధ్వర్యంలో 100 మంది పోలీసు సిబ్బందికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవాభారతి కార్యకర్తలు దాతలు పాల్గొన్నారు.

* తూ. గో జిల్లా, ముమ్మిడివరం మండలం, చినకొత్త లంక లోని నిరు పేద కుటుంబాలకు సేవా భారతి కార్యకర్తలు నిత్యావసర వస్తువుల వితరణ చేశారు. కరోనాపై అవగాహన కల్పిస్తున్నారు. కావలసిన వారికి మెడిసిన్స్ అందిస్తున్నారు. అందరూ ఇంటిలోనే ఉండాలని సూచిస్తున్నారు.

* నెల్లూరులో పోలీసు వారికి RSS (శ్రీకృష్ణదేవరాయ శాఖ) బాగ్ 2 వారి తరుపున భోజనం ఇవ్వడం జరిగింది.

* కర్నూలు జిల్లా నంద్యాలలో కూడా కార్యకర్తలు పోలీసులకు, పారిశుధ్య కార్మికులకు, ఇతర అత్యవసర విభాగాలలో పనిచేసే వారికి ఆహార పొట్లాలు అందించారు.

అన్ని జిల్లాల్లోనూ జన సంక్షేమ సమితి, సేవాభారతి, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ కార్యకర్తలు ప్రభుత్వ మరియు పోలీసు యంత్రాంగాన్ని కలిసి అన్ని రకాల సేవలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఎటువంటి ప్రజావసరాలకైనా తమ సేవలను వినియోగించుకోవచ్చునని విజ్ఞప్తి చేశారు.

దేశమంతా సంపూర్ణంగా లాక్ డౌన్ లో ఉన్న దరిమిలా రాబోవు రోజుల్లో వివిధ రకాల సేవా అవసరాలు రావచ్చు. స్వయం సేవకులు అవసరమైన వైద్యపరమైన జాగ్రత్తలు తీసుకుంటూ, పోలీసువారి నియమాలు పాటిస్తూ సహాయ కార్యక్రమాలు చేయడానికి సన్నద్ధంగా ఉండాలని జన సంక్షేమ సమితి అధ్యక్షులు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రాంత సంఘచలక్ శ్రీ భూపతిరాజు శ్రీనివాసరాజు కార్యకర్తలను కోరారు.

1వ పేజీ తరువాయి

## జాతి నిర్మాణంలో...







అలాగే సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా శ్రీ తిరుపతయ్య కర్నూలు జిల్లా ఆదోని, కోసిగి, ముదుమాల గ్రామాలలోని అరుంధతీయ వాడలలో పర్యటించారు. ఆ సందర్భంగా ఆ గ్రామాలలోని అరుంధతీయ బంధువులకు సంత్ రవిదాస్ చిత్రపటాలను అందజేశారు. అరుంధతీయ, హరిజన బంధువులందరూ భక్తాగ్రేసరుడు అయిన సంత్ రవిదాస్, వీరుడైన కన్నమదాసు, యోగి పుంగవుడైన ముమ్మిడివరం బాలయోగి, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ల వారసులని, భారతదేశం యొక్క ప్రగతిలో, ప్రతి అడుగులో వారందరూ భాగస్వాములేనని, భవిష్యత్తులో కూడా దేశం యొక్క ప్రగతిపథంలో అందరూ భాగస్వామ్యం వహిస్తారని ఆయన పేర్కొన్నారు. అన్య మతాల వలలో పడకుండా అందరమూ మాతృ ధర్మాన్ని ఆచరిస్తూ జీవితాలను ధన్యం గావించుకోవాలని శ్రీ తిరుపతయ్య తెలిపారు.

# పుస్తకాల పురుగు



నేడు యువతే కాదు చిన్నారులు కూడా సామజిక మాధ్యమాల ఉచ్చులో పడుతున్నారు. గత దశాబ్దకాలంగా పుస్తక పఠనం క్రమంగా తగ్గిపోతూ ఇతర సామజిక మాధ్యమాలపైనే పూర్తిగా ఆధారపడటం చూస్తున్నాం. విజ్ఞానం పెంపొందించడానికి సామజిక మాధ్యమాలు ముఖ్యమే అయినప్పటికీ జ్ఞాన సముపార్జనకు మూలమైన పుస్తకాలను పక్కకు పెడితే అది విపరిణామాలకు దారితీస్తుంది. అయితే ఆధునిక సాధనాలతో పాటు పుస్తకాలను కూడా పఠనం చేస్తే సాధించలేనిది లేదని ఋజువు చేస్తోంది చిన్నారి శ్రీహర్షిక.

విజయవాడకు చెందిన శ్రీ మురళి, శ్రీమతి రేఖల ముద్దులపట్టి 14 ఏళ్ల గుడ్లవల్లేటి శ్రీహర్షిక 8వ తరగతి చదువుతోంది. తల్లి స్ఫూర్తితో పుస్తక పఠనంపై ఎక్కువగా మక్కువ చూపే శ్రీహర్షిక తన పాఠ్యాంశాలతో పాటు చిన్న, పెద్ద ఆంగ్ల పుస్తకాలు సుమారు 70 కి పైగా చదివింది. వీటిలో బాల సాహిత్యంతోపాటు వీరుల చరిత్రలు, ప్రముఖ రచయితల పుస్తకాలను కూడా చదివి ప్రేరణగా నిలుస్తోంది. పుస్తకాలు పఠించడమే కాదు, వాటిపై సమీక్ష చేసి నలుగురికీ వాటి గురించి తెలియజేసే ఆలోచన ఆమెలో మెదిలింది. ఒక యూట్యూబ్ ఛానల్‌ని తన అక్క సాయంతో ప్రారంభించింది శ్రీహర్షిక. చదివిన పుస్తకాలను సమీక్షించి రచయితలతోపాటు పుస్తకంలో అనేక విశేషాలను క్లుప్తంగా 'బుక్ టాకీస్' అనే తన యూట్యూబ్ ఛానల్ లో క్రమం తప్పకుండా ప్రతి వారం విశ్లేషిస్తుంది. ప్రధాని నరేంద్ర మోడీ వ్రాసిన 'ది ఎగ్జామ్ వారియర్స్' పుస్తక విశ్లేషణతో తన యూట్యూబ్ ఛానల్ పుస్తక సమీక్ష ప్రస్థానం ప్రారంభించింది. మేధా దేశ్‌ముఖ్ భాస్కరన్ రచించిన ఛత్రపతి శివాజీ జీవిత విశేషాలు 'ఛాలెంజింగ్ డెస్టినీ', రస్కిన్ బాండ్ 'బ్లూ అంబరిల్లా', అమరచిత్ర కథ ప్రచురణలైన మీరాబాయి, అంబేద్కర్, రడ్‌యార్డ్ కిప్లింగ్ 'ది జంగిల్ బుక్', వంటి బాగా ప్రాచుర్యం పొందిన పుస్తకాలను సమీక్షించి పుస్తకాల పట్ల తనకున్న జిజ్ఞాసను చాటుకుంటోంది. శ్రీహర్షిక చేస్తున్న ఈ ప్రయత్నానికి పాఠశాలలోని తోటి విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, పుస్తక ప్రియులు కూడా ప్రశంసలు కురిపించారు. ప్రతిష్ఠాకరమైన విజయవాడ బుక్ ఫెస్టివల్ విశేషాలను బుక్ టాకీస్ ఛానల్ లో ప్రెజెంటేషన్ చేసిన తీరు పలువురిని ఆకట్టుకుంది. ఆ సందర్భంగా మానసిక విశ్లేషకుడు, ప్రముఖ రచయిత శ్రీ బీవీ పట్టాభిరామ్ నుండి ప్రత్యేక ప్రశంసలు పొందింది. ఇదే సందర్భంగా సాహిత్య నికేతన్ పుస్తకాలను కూడా విశ్లేషించింది.

శ్రీహర్షిక తాజాగా పుస్తక రచనలకు కూడా శ్రీకారం చుట్టడానికి తొలి అడుగు వేసింది. రెండు ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థలు ఇప్పటికే శ్రీహర్షిక రాసిన కథనాలను తమ పుస్తక సంకలనాల్లో ప్రచురించడానికి ముందుకు వచ్చాయి. త్వరలో అవి ముద్రితమవ్వనున్నాయి. ఇప్పటికే ది టైమ్స్ ఆఫ్ ఇండియా, ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రముఖ దినపత్రికల్లో శ్రీహర్షిక వ్యాసాలు కూడా ప్రచురితమై పలువురి మన్ననలు పొందాయి. చిన్నారి శ్రీహర్షిక భవిష్యత్ లో మంచి పుస్తక రచయితగా, విశ్లేషకురాలిగా ఉన్నత శిఖరాలకు వెళ్తుందని ఆశిస్తూ అభినందిద్దాం.

## నెలకో పద్యం

**నీచగుణములెల్ల నిర్మూలమైపోవు**
**కొదవలేదు సుజన గోష్ఠి వలన**
**గంధ మలద మేనికంపడగినయట్లు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం:** సుగంధ భరితమైన చందనాన్ని శరీరానికి పూసుకుంటే దేహానికుండే దుర్గంధం ఎలా పోతుందో అలాగే సుజన గోష్ఠి వలన మనలోని చెడు గుణాలన్నీ దూరమైపోతాయి. అందుచేత సదా సజ్జన సాంగత్యాన్నే కోరుకోవాలి అని అర్థం.

## మంచిమాట



విజేత వెనుక వుండేది అదృష్టమో, మంత్ర దండమో కాదు. కఠిన శ్రమ,అంకిత భావం

– డా॥ అబ్దుల్ కలాం.

# ఆధునిక జీవనానికి ఆయువుపట్టు మన భారతీయ సంస్కృతి

– పులిగడ్డ రాధాదేవి



మనందరికీ తెలిసిన మన పాత తరం పెద్దవాళ్ళు, కుటుంబ సభ్యులు అందరూ ఒకేచోట ఉంటూ ఉండేవారు. అందరి పిల్లలూ ఒకే చోట పెరిగేవారు. పెద్దలంతా ఒకరి అవసరాలకు ఒకరు తోడుగా నిలిచి అన్ని పనులూ చక్కబెట్టుకునేవారు.

ఆ తర్వాతి తరంలో ఉద్యోగాల పేరుతో కాస్త దూర ప్రాంతాలకి వెళ్ళడం మొదలయింది. పుట్టిన ఊరు, తల్లితండ్రులు, బంధువులు ఇలా వీళ్ళందరినీ వదిలి వచ్చినందుకు వీళ్ళు చాలా బాధ పడుతూ ఉండేవారు.అందుకే పండగలకు, ఉత్సవాలకు, ఇతర సందర్భాలకు సొంత ఊళ్లకు వెడుతూ ఉండేవారు. అదో ఆనందం.

నెమ్మదిగా పని చేసే చోట పరిచయాలు పెరగడం, స్నేహితులు సన్నిహితులుగా మారడం,అందరూ అరమరికలు లేకుండా కుటుంబ సభ్యులుగా కలిసి పోవడం జరగింది. అయితే వీళ్లలో ఒక్కో వయసు వాళ్లు ఒక్కో బృందంగా ఉండేవారు. ఆడవాళ్ళు మగవాళ్ళు, పిల్లలు, పెద్దలు ఇలా ఎవరి గ్రూప్ వాళ్ళకి ఉండేది. అన్ని విషయాలను ఎంతో ఆసక్తితో పరిశీలించి, క్రమ శిక్షణతో ఆచరించి, నిజాయితీగా వ్యవహరించేవారు. అందుకని ఇక్కడ వృద్ధులకీ,పెద్దవాళ్ళకీ గౌరవం, యువతరానికి తగిన జాగ్రత్తలు, పిల్లలకు కావలసిన అలనా పాలనా అన్నీ సమపాళ్లలో ఉండేవి.

ఇక ప్రస్తుతం సమకాలీన సమాజంలో కొత్తతరం కుటుంబాలు,పరిచయాలు చూస్తున్నాం. వీళ్ళు ఉన్నతమైన ఉద్యోగాలకోసం తల్లితండ్రులకు, బంధువులకు దూరంగా కొత్త కొత్త దేశాలకే తరలి వెళ్లిపోతున్నారు. అక్కడ తమదైన శైలిలో ఉనికిని నిలబెట్టుకుంటూ,గౌరవ మర్యాదలు పొందుతున్నారు.

అయితే ప్రస్తుతం ఈ కొత్త తరంలో వచ్చిన సాంకేతిక విప్లవం కారణంగా ఈ కుటుంబ బంధాలు, అనుబంధాల రూపు రేఖలు, వైఖరీ కూడా చాలా మారాయి. గతంలో లాగా ఏవో కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే కాకుండా, అందరినీ రోజూ పలకరించే అవకాశం ఉంది. అలాగే బంధు బలగం తోపాటు స్నేహితుల సంఖ్య కూడా విస్తరిస్తోంది. మళ్లీ ఇందులో స్త్రీ పురుష బేధాలు,వయసు అంతరాలు కూడా చాల తక్కువగా ఉంటున్నాయి.

డిజిటలైజేషన్ పుణ్యమా అని ఈ కొత్త శతాబ్దంలో అన్ని అంతరాలు తొలగిపోయి ఒకరితో ఒకరు చక్కని అనుబంధాలను కలిగి ఉంటున్నారు. ముఖ్యంగా ప్రతివారి చేతిలోనూ సేవలు అందిస్తున్న ఆధునిక సెల్ ఫోన్లు దీనికి ప్రధాన కారణం. ఎంతో ఒత్తిడితో ఉంటున్న ఈనాటి సామాజిక జీవనంలో అందరితో కలసి పోవడం అనేది ముఖ్య సూత్రం. చక్కని బృందంలో చేరి ఉండటం, వాళ్ళతో అభిరుచులను,భావాలని పంచుకోవడం ఈరోజున చాలా ముఖ్యం. ఎక్కడో దూరాన ఉన్నవారితో కూడా తరచూ సంభాషించే అవకాశం ఉంది. అందువల్లనే ఇప్పుడు బంధుత్వం కంటే కూడా భావాలు కలవడమే స్నేహానికి ప్రాతిపదికగా ఉంది.

ఆధ్యాత్మిక ఆసక్తి ఉన్న బృందం, ఆరోగ్య స్పృహ ఉన్న బృందం మొదలుకొని ఎన్నోరకాల అభిరుచులు ఉన్నవారు ఈ బృందాలలో ప్రతిరోజూ తమ ఆలోచనలు కలబోసుకుంటున్నారు. వీరు నిర్వహించే సామాజిక సమావేశాలు ఇప్పుడు ఎంతో మందిని ఆకర్షిస్తున్నాయి.

ఈ సందర్భంగా మనం కొన్ని ముఖ్య విషయాలను గుర్తు పెట్టుకొని ఆచరించాలి. అందువలన మనం మరింత మెరుగైన సామాజిక జీవితాలను పంచుకోగలుగుతాము.

1. “వైవిధ్యంలో ఏకత్వం” అనే గొప్ప సంస్కృతి ఉన్న మన భారతీయ సమాజంలో మన ఆలోచనా బృందాలు చక్కని మార్పును తేవాల్సిన అవసరం ఉంది. మనం ఏ బృందంలో సభ్యులుగా ఉన్నా, ముందు మన భాష, సంస్కృతికి ప్రాధాన్యత ఇవ్వాలి. మనం ఎన్నో దేశాల భాష, వేషాలను నేర్చుకుని గౌరవిస్తూ ఉంటాం. అలాగే, మన దేశ భాషలు, సంస్కార విలువలు, సంప్రదాయాలను కూడా ప్రోత్సహిస్తూ ఆచరించవలసిన అవసరం ఉంది.

2. నేడు మనదేశంలోనే యువజనుల సంఖ్య ఎక్కువగా ఉంది. మరి దీని అర్థం దేశంలో అత్యాచారాలు,అరాచకాలు, అల్లర్లు పెరగడమా? ఇదేనా మనం కోరేది? ఇది కాదు. మన యువతరానికి సరైన దిశా నిర్దేశనం చేసే విధంగా ఈ సామాజిక సమాచార బృందాలు పనిచేయాలి. మన ఇంట్లో ఉన్న మన పిల్లల భద్రత గురించి ఎంత ఆలోచిస్తామో, వారి నుండి ఎలాంటి చక్కటి ప్రవర్తనని ఆశిస్తామో అలాగే అందరి గురించీ ఆలోచించాలి.

3. ప్రతిరోజూ ఎన్నో విషయాలను ఎంతో వేగంగా మనం తెలుసుకుంటున్నాం. అయితే, వీటిని సరైన అవగాహన ఉంటేనే ఇతరులకు తెలియజేయడం,దానికి సంస్కారవంతమైన భాష, భావాలను ఉపయోగించడం చాలా అవసరం. సమస్యలను సరిగా అర్థం చేసుకుని,సరైన విధానంలో స్పందించటం, సేవా భావాన్ని కలిగి ఉండి మన బృందంతో సకాలంలో స్పందించటం చాలా అవసరం.

ప్రస్తుతం కరోనా నేపథ్యంలో ప్రపంచమంతా భారతీయ పద్ధతులను కొన్నిటిని అనుసరిస్తూ ఉండడం మనం చూస్తున్నాం. అంతేకాకుండా భారతీయ యోగ, ధ్యానం వంటి వాటిని తమ శారీరిక, మానసిక, కౌటుంబిక, సామాజిక సమస్యలకు పరిష్కారాలుగా ప్రపంచంలోని అనేకులు భావించి అనుసరిస్తూ ఉండటం కూడా మనకు తెలుసు. డాక్టర్ డేవిడ్ ఫ్రాలే చెప్పినట్లుగా “భారతదేశం యొక్క సౌభాగ్యం యావత్ ప్రపంచం యొక్క సౌభాగ్యం కోసమే” అనే విషయాన్ని యావత్ ప్రపంచం ఆమోదించి ఆచరించే రోజు ఎంతో దూరంలో లేదు.

రాబోయే రోజుల్లో కొత్త ఆవిష్కరణలు మనందరినీ మనుషులుగా సహృదయులుగా దగ్గర చేయాలి.వివేకంతో ప్రవర్తించే విచక్షణ ఇవ్వాలి. కొత్త టెక్నాలజీ మన శరీరానికి,మనసుకి,బుద్ధికి సరైన దారి చూపేదిగా ఉపయోగించాలి.మన మాటలో, నడవడిలో భారతీయత ప్రతిఫలించాలి. భారతీయ సంస్కారం, సంస్కృతి విశ్వమంతా వ్యాపించి పరిమళించాలి. ఇదే నిజమైన ఆధునిక జీవన విధానం.

---

నారీ నగారా

# అమ్మ చేసి చూపింది



మీనల్ భోస్లే వైరాలజిస్టు. మైల్యాబ్స్ సంస్థలో చీఫ్ రిసెర్చ్ ఆఫీసర్ గా, రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. కరోనా వైరస్ కేసులు భారత్ లో వెలుగుచూసే సమయానికి ఆమె నిండు గర్భిణి.గర్భ సంబంధ సమస్యల కారణంగా ఫిబ్రవరిలో కొన్నాళ్లు హాస్పిటల్ లో చికిత్స తీసుకున్నారు కూడా. ఏ క్షణంలోనైనా ప్రసవం కావొచ్చని, జాగ్రత్తలు తీసుకోమని చెప్పి పంపారు వైద్యులు. ఆమె మాత్రం అవేవీ పట్టించుకోలేదు.

హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయిన కొన్ని రోజులకే కరోనా నిర్ధారణ కిట్ల తయారీకి ఎంపిక చేసిన జట్టుకు నాయకత్వం వహించారు. ఆరోగ్య సమస్యలు ఇబ్బందులు పెడుతున్నా వెనకడుగు వేయలేదు. ఫిబ్రవరిలో పది మంది బృంద సభ్యులతో శ్రీకారం చుట్టి కేవలం ఆరు వారాల్లోనే కిట్‌ను రూపొందించారు. దీనికి ‘పాథో డిటెక్ట్’ అని పేరు పెట్టారు.

ఇప్పటికే విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వైరస్ నిర్ధారణ పరికరాలను మన దేశంలో వాడుతున్నారు. వాటి ధర సుమారు 4500 రూపాయలు. పైగా వైరస్ నిర్ధారించడానికి ఇవి ఆరు నుంచి ఏడు గంటల సమయం తీసుకుంటాయి. మినాల్ తయారుచేసిన పరికరం ధర కేవలం 1200 రూపాయలే. ఇవి రెండున్నర గంటల్లోనే నిర్ధారణ పరీక్షల ఫలితాలను ఇవ్వడం విశేషం.

సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ‘పాథో డిటెక్ట్’ కు కమర్షియల్ అప్రూవల్ ఇచ్చింది. కరోనా వైరస్ టెస్టింగ్ లో ఈ కిట్ వందశాతం సత్ఫలితాలనిచ్చినట్టు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ తెలిపింది. ఇప్పటికే 150 కిట్లను అవసరమైన వైద్యశాలలకు పంపించారు. ప్రభుత్వం ఆదేశిస్తే రోజుకు వేలల్లోనూ వీటిని తయారుచేసి ఇచ్చేందుకు సిద్ధమంటోందా సంస్థ.

# గోవు మనందరి తల్లి



గోవు భారతీయ సభ్యత, సంస్కృతి మరియు జాతీయ జీవితంతో ముడి పడిఉన్న అంశం. గోవుపట్ల మనకుగల సాంస్క ృతిక, ఆర్థిక, రాజకీయ దృష్టి కోణాలన్నీ ఈ దేశ వాసుల ప్రధాన వృత్తి అయిన వ్యవసాయంతో ముడిపడి ఉన్నాయి. భారతీయ సంస్క ృతి యొక్క మూలాధార విశ్వాసం 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి" "ఒకే సత్యాన్ని పండితులు పలువిధాలుగా చెప్తారు" అనే ధ్యేయ వాక్యం కారణంగా ఇచ్చటి సమాజ సహజీవనం యొక్క మూల సూత్రం 'అహింస' గా పరిగణించబడింది. భారతీయులకు, గోపూజ ఆత్మ బోధకు ఉపకరించే ఒక సనాతన మార్గం. పరంపరానుగతమైన భారతీయ సమాజానికి ప్రతీక గోవు. అది అహింసా ప్రధానము, ఆత్మ బోధాత్మకమే గాక సనాతన భారతీయ సంస్క ృతి యొక్క సంవర్ధనకై సమాజంలో సామూహిక స్ఫూర్తిని ఇది అందిస్తుంది. అందువల్ల యజుర్వేదం ఇలా అంటుంది. "గోః మాత్రా న విద్యతే' అంటే "గోవు చేసే ఉపకారాలకు అంతమే లేదు" గోవు మనకెంతగానో మేలు చేస్తుంది.

ధార్మిక, సాంస్కృతిక దృష్టితో పరిశీలించినప్పుడు గోవు అనాది కాలం నుండి హిందూ సమాజానికి అత్యంత ప్రీతిపాత్రము, శ్రద్ధా కేంద్రము, పూజార్హము అయినట్లుగా, అహింసా ప్రధానమైన మన సంస్కృతికి గోమాత కేంద్రబిందువుగా నిలిచినట్లుగా దర్శనమిస్తుంది. అంతేగాక గోవు మన సామాజిక, ఆర్థిక జీవనానికి వెన్నెముకగానూ నిలిచినట్లు బోధపడుతుంది. గోరక్ష, గోసేవ, వీటిని మన సామాజిక ఆకాంక్షలలో ఒక విడదీయలేని భాగంగా మనం గుర్తించాము.

చారిత్రక దృష్టితో పరికిస్తే గోరక్షణకు సంబంధించిన ప్రశ్న మొట్టమొదటగా ముస్లిం శాసనకాలంలోనే కనపడుతుంది. అంతకు ముందు కాలంలో గోహత్య అసలు ఊహకందని మాట.ఇస్లాం ఈ దేశంలో హిందూ ధర్మ సంస్కృతులను సమూలంగా నాశనం చేయాలని ఆశించింది.

అంతకు పూర్వం ఇస్లాం ఆక్రమించిన దేశాలన్నింటిలోనూ ఆయాదేశాల ధర్మ సంస్క ృతులను నాశనం చేయడంలో అది కృతకృత్యమైంది. అయితే ఈ దేశంలో అది పూర్తి సాఫల్యతను పొందనప్పటికీ అందుకోసం అది అన్ని ప్రయత్నాలూ చేసింది. ఇస్లాంను మించి ఆంగ్లేయుల కాలంలో విదేశీ సంస్కారాలతో ఎదిగిన హిందువులు హిందూ వ్యతిరేకతలో ఇస్లామీ శక్తులకు సహాయకులుగానే నిలిచారు. హిందూ ధర్మ సంస్క ృతుల చిహ్నాలైన ఆవులు, దేవాలయాలపైన బరితెగించి సమ్మెట పోట్లు పొడిచారు. ఇప్పటికీ ఇది కొనసాగుతూనే ఉన్నది. నేడు గోమాత అత్యంత దయనీయమైన స్థితికి గురియైపోయింది. ఈ నేలపై గోమాత యొక్క రక్తపు నదులు ప్రవహిస్తున్నాయి.

ఆంగ్లేయులు గోమాంస భక్షకులు. వారు ఆవును మాంసాన్నిచ్చే జంతువుగానే గుర్తించారు.ముస్లింలు తాము గోమాంసం తినడానికన్నా హిందువుల మనోభావాలను గాయపరిచేందుకే గోహత్యను ముమ్మరంగా కొనసాగించారు. మందిరాలను నేలమట్టం చేసి మసీదులు కట్టేందుకు ముందు వారు కావాలని గోవుల రక్తాన్ని ఆ స్థలంపై అలికేవారు. కారణమేమిటంటే హిందువు మళ్ళీ దేవాలయం కట్టరాదని, తాము ముట్టడి జరిపే సమయంలో చేజిక్కిన ప్రాంతంలో బావులు,చెరువులు, నదులు, కాలువల్లో గోవు మాంసాన్ని, రక్తాన్నికలుపుతూండేవారు. కారణం విధిలేక హిందువులు తమ పాదాక్రాంతం కావాలని. విశేషించి బ్రాహ్మణులు, సాధుసంతుల నోళ్ళలో బలవంతంగా గోమాంసాన్ని కుక్కి వారిని మతాంతరీకరణకు గురి చేస్తుండేవారు. అయితే ఇన్ని ఘాతుకాలకు గురైనప్పటికీ హిందూ సమాజం సదా సర్వదా గోరక్షా కార్యంలో తన ప్రయత్నాలను మానలేదు.

## పాఠకుల నగారా

మార్చి నెల హిందూనగారా పత్రిక మమ్ములను ఆద్యంతము అలరించింది. ప్రతి నెలా హిందూ నగారా ద్వారా కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉన్నాం. ఆంధ్రప్రదేశ్లో హిందూ సంస్థలపై జరుగుతున్న దాడుల పట్ల ధర్మాగ్రహాన్ని వెలిబుచ్చిన "సంపాదకుని నగారా" చాలా సహేతుకంగా, వివరణాత్మకంగా ఉన్నది. నారీ నగారాలో అభయారణ్యంలోని వన్యమ ృగాలకు రక్షణ కల్పిస్తున్న సాహస మహిళ రశీలా వాధెర్ గురించి తెలుసుకొని ఆశ్చర్యపోయాం. "ఇక చూడలేరేమో రాబోవు తరము" అంటూ శ్రీ సురేంద్ర రొడ్డ గారు "కలం నగారా" లో వెలిబుచ్చిన ఆవేదన మా హ ృదయాన్ని తాకింది. అమ్మ తోడుంటే ఎంతెత్తైనాఎక్కేస్తానంటున్న చిన్నారి పర్వతారోహకుడు సమన్యు ఉత్సాహం ముచ్చట గొలిపింది. నెల నెలా మా వాకిట విరిసే వార్తా కదంబం హిందూ నగారా.

**– విజయలక్ష్మి, విజయవాడ.**

Postal Registration No:VJ/152/2020-22 RNI No. 52882/93
Date of Printing : 28-3-2020-Date of Posting : 06-04-2020 - Pages: 12

# పాశ్చాత్య ఆలోచనా విధానం పర్యావరణానికి పెను శాపం

అనేక వందల సంవత్సరాలుగా పాశ్చాత్య ఆలోచనా విధానం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తోంది. ఇది సంస్కృతి, నాగరికతను ప్రభావితం చేసింది. యాంత్రికమైన ఈ ఆలోచనా ధోరణి భౌతికవాదంగా రూపుదిద్దుకుంది. 'బలవంతుడు విజయం సాధిస్తాడు' అనే ఆలోచన, శోషణకు ఈ ధోరణి మూలం, 'వ్యక్తి, ప్రకృతి, ప్రపంచం వేరువేరు' అనే ఆలోచన వల్ల వ్యక్తి ప్రకృతిని ఇష్టానుసారం ఉపయోగించుకోవచ్చుననే ధోరణి ప్రబలింది.



యాంత్రిక ధోరణి పర్యావరణం, సమాజం, వ్యక్తులపై ఎంతో ప్రభావాన్ని చూపింది. వ్యక్తి స్థాయి భౌతికవాదం 'వస్తువాదానికి' దారి తీసింది. ఇదే భౌతికవాదం అనేక పర్యావరణ సమస్యలకు కారణమయింది.

**పర్యావరణ సంక్షోభం :**

కోరికలను తీర్చుకోవడానికి అనేక వస్తువులను ఉత్పత్తి చేస్తున్నారు. వస్తు ఉత్పత్తికి ప్రకృతి వనరులను ఉపయోగిస్తున్నారు. ఉత్పత్తి ప్రక్రియ కాలుష్యానికి దారి తీస్తోంది.

వనరుల తరుగుదల, కాలుష్యం పర్యావరణ సమస్యలలో ప్రధానమైనవి. ఇవికాక అనేక సమస్యలు కూడా కలుగుతున్నాయి. వాతావరణపు 'వేడి ఎక్కువ కావడం' (గ్రీన్ హౌస్ ఎఫెక్ట్) వీటిలో ఒకటి. అలాగే ఓజోన్ పొరలో రంధ్రాలు, భూక్షయం, అడవులు క్షీణించి పోవడం మరికొన్ని సమస్యలు. ఈ సమస్యలన్నింటి వల్ల పర్యావరణం అనారోగ్యకరంగా హానికరంగా మారుతోంది. అనేక వందలాది వృక్షజాతులు నశించి పోతున్నాయి.

అభివృద్ధి పేరిట పర్యావరణానికి చేటు కలిగించడం ద్వారా మానవుడు తన అభివృద్ధికి తానే అవరోధం కలిగించుకుంటున్నాడు.

# ఆరెస్సెస్‌లో బాధ్యతల మార్పు

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అఖిల భారతీయ ప్రతినిధి సభ (ABPS) సందర్భంగా ప్రతి ఏడాది అఖిల భారతీయ, క్షేత్ర స్థాయిలలో వివిధ బాధ్యతలలో వచ్చిన మార్పులను ప్రకటించడం రివాజు. అయితే ఈ ఏడాది కరోనా వైరస్ విస్తృతి దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు బెంగళూరులో ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించ తలపెట్టిన అఖిల భారతీయ ప్రతినిధి సభలు వాయిదా పడ్డాయి. అయినప్పటికీ ఈ ఏడాది అఖిలభారత మరియు క్షేత్రస్థాయి బాధ్యతలలో ఏర్పడిన మార్పులను ప్రకటించారు.




♦ శ్రీ సునీల్ అంబేకర్ - అఖిల భారతీయ సహ ప్రచార ప్రముఖ్ ♦ శ్రీ ఆలె శ్యాంకుమార్, ధర్మజాగరణ అఖిల భారతీయ సహ సంయోజక్ ♦ శ్రీ సుధీర్, దక్షిణ మధ్య క్షేత్ర (ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక) ప్రచారక్ ♦ శ్రీ రఘునందన్, విద్యా భారతి ♦ శ్రీ సెంథిల్, దక్షిణ క్షేత్ర (తమిళనాడు, కేరళ) ప్రచారక్ ♦ శ్రీ లింబారాం, ఉత్తర పశ్చిమ క్షేత్ర ప్రచారక్ ♦ శ్రీ స్థాణుమలయన్, గ్రామీణ వికాసం, దక్షిణ, దక్షిణ మధ్య క్షేత్రాలు

చందాదారులుగా చేరండి! చేర్పించండి
హిందూనగారా సంవత్సర చందా రూ. 50
మీతో పాటుగా మరి కొంతమందిని
చందాదారులుగా చేర్పించండి.
SBI PrajasakthiNagar, VJA
SB A/C No. 10032482732
IFSC Code : SBIN0007899
పంపవలసిన చిరునామా
మేనేజర్
**హిందూనగారా**
మాధవసదన్, కాళేశ్వరరావు రోడ్,
విజయవాడ-520002.

Published and owned by : Tulasi Surya Prakash, and published from Madhavasadan, Kaleswara Rao Road, Governerpet, Vijayawada - 520002 and Printer Chiruvolu Vasudeva Rao and Printed at Vanaja Graphics, 33-21-13/A, Sitharampuram, Vijayawada-2. Editor- Chiruvolu Vasu Deva Rao. Ph: 9490923439